ఈనాడు ఆదివారం - 7, ఫిబ్రవరి 1999

# హార్టిస్టులు!

ఆ రోజు పశుపతిగారు యాభయ్యో పడిలో ప్రవేశించాడు. దాంతో వారింటి ఆవరణలోకి సంతోషం దివి నుంచి దిగి వచ్చి, వేడుకై ఆయన బంధుమిత్రులను ఆనంద సముద్రంలో ముంచెత్తుతోంది. పశుపతి సూపర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్స్ అధినేతల్లో ఒకరు. వీరి సంస్థ ఐదారేళ్లుగా తెలుగునాట చాలా నగరాల్లో, పట్టణాల్లో వేళ్లూనింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తన పేరు స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుకోగల్గుతోందంటే, అందుకు పశుపతిగారి హైటెక్ నాలెడ్జి ఎంతో సహకరిస్తోందని చాలామంది ఒప్పుకుంటారు. అందుకే ఈ వేళ ఆయన జన్మదిన వేడుకకు మేలుజాతి పురుషపుంగవులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. గౌరవంతో కానుకలు అందించిన వారందరికీ ఆయన చిన్న నవ్వుతోనూ ఆపైన విందు భోజనంతోనూ సమాధానం చెప్పాడు.

పార్టీ అయిన జనం పల్చబడుతూంటే పశుపతి ఆ రోజు కార్యక్రమానికి సారథ్యం వహించి దాన్ని చిరస్మరణీయం చేసిన తన స్టాఫ్‌లో ముఖ్యులయిన ప్రణవ్‌కూ, త్రివర్ణకూ కృతజ్ఞతలు చెప్పాడు. ప్రణవ్‌ను పొగిడి వీపు తట్టాడు. త్రివర్ణను పదే పదే పొగిడాడు.

ఆ సమయంలో ఆ వేడుకలో పాలుపంచుకుని, అప్తుల అభినందనలు అందుకుని ఉబ్బితబ్బిబ్బయి, దాంతో అలసటకు లోనైన రాగిణిగారు తమ ఆవరణలోనే వున్న పారిజాతం చెట్టుకింద సోఫాలో కూర్చుండిపోయింది. ఆమె కట్టుకున్న ఖరీదయిన పట్టుచీర, శరీరం మీది ప్రతి ముఖ్యాంశాన్నీ ఆక్రమించుకుని గర్వంతో తళుకులీనుతున్న బంగారు నగలు, ఇంకా పదేళ్ల బట్టీ పెను తుపానులా ముంచెత్తుతున్న సంపద, వద్దన్నా దానిని వెన్నంటి వచ్చిన హోదా - అన్నీ కూడా తామూ, తమ ఉనికీ 'తాత్కాలికం, అశాశ్వితం' అని తరచు భయపెడుతున్నట్టే వుంటుంది. అందుకే కాబోలు, ఆరోజు వేడుకలో కూడా నూటికి నూరుశాతం ఇమిడిపోలేని ఆమె మనసు, దూరంగా ఎక్కడో వుండే ప్రశాంత తీరాల వెంట పరిగెడుతోంది!!

"ఏం, మేడమ్, ఒక్కత్తివీ కూర్చుని ఏమిటి ఆలోచిస్తున్నావ్... నీకోసం చూశాను. ఇక్కడ కూర్చున్నావా?..." అంటూ పశుపతి ఆమెను పలకరించాడు.

"కాళ్లు పీకాయి... కూలబడ్డాను. ముఖ్యులందరూ వెళ్లినట్టేనా?"

"వచ్చిన వాళ్లు ఒక్కొక్కళ్లే వెళుతున్నారు. ఫైనల్‌గా నువ్వు, నేను మిగులుతాం" అని ఓ క్షణం ఆగి, "అవునూ అందరూ రకరకాలుగా అభినందనలు చెప్పారు. కానీనువ్వేం చెప్పలేదు సుమా, నాకు?" అన్నాడు.

"మీరు చెవిన పెట్టలేదు గానీ పొద్దున్నే చెప్పాను. ఇప్పుడు పెద్దగా చెప్పేదా?"

"చెప్పవోయ్... నీకు అడ్డేమిటి, బెటరాఫ్‌ని... పైగా నా ఉన్నతికి సోపానానివీ ఆధారభూతానివీ..."

రాగిణి నవ్వేసి "ప్రస్తుతానికి భూతాన్నీ దెయ్యాన్నీ కాను. ముందేమవుతానో తెలియదు. ఇక అసలు విషయం మీరు యాభైయ్యో ఏట ప్రవేశించారు. ఈ గడిలో పడిన వృద్ధులు. గడిచిన అనుభవాలను నెమరువేసుకుంటూ, ముందు జరపబోయే మహాప్రస్థానానికి రంగం సిద్ధం చేసుకోవాలి. అలాగని త్వరగా యోగితత్వం వంటబట్టదనుకోండి. కనీసం కర్మయోగులను ఆదర్శంగా తీసుకోగలిగితే, మీకూ మీ ద్వారా నాకు శాంతి... సరేనా?" అంది.

పశుపతి నవ్వేసి రహస్యంగా, "నేను ముసిలివాణ్ణి అయిపోతున్నానని హెచ్చరిస్తున్నావన్నమాట. అంతేనా?" అన్నాడు, నవ్వి. రాగిణి కూడా నవ్వుతూ జవాబిచ్చింది... "యాభై దాటిన తరువాత వద్దన్నా తిరిగి పసితనం తన్నుకు వస్తుందని పెద్దలు అంటుంటారు. అందుకుని భయం.."

"పెద్ద సంస్థకు అధినేతగా ఉంటున్నాను. బాధ్యతలు పెరిగాయి. వ్యక్తిపరంగా కర్మయోగం ఆచరణీయమే. కానీ వ్యవస్థ పరంగా భిన్నరూపాలు ఎత్తవల్సి వస్తుంది. లేకపోతే అసమర్ధుడననే అపవాదు పడుతుంది..."

"ఏ అపాయంలో పడకుండా జాగ్రత్తలు తీసుకోగల్గడం కూడా ఓ బాధ్యతే అవుతుంది కదండీ... అది చెప్పడానికే మీ కోసం ఈ పారిజాతం చెట్టు కింద నేల జారిన మంచుపుష్పంలా ఎదురు చూస్తున్నాను."

"భేష్ నా మీద నీకున్న ప్రేమను పోయిట్రీ రూపంలో చెప్పావు. ఏం కావాలో కోరుకో" అన్నాడు, ఊగిపోతూ పశుపతి. రాగిణి తలెత్తి చూసింది. ఆమె ఏదో చెప్పబోయింది. అంతలో దూరం నుంచి వస్తూన్న అతిథుల్ని చూసి, "ఇప్పుడే వస్తాను" అని పశుపతి లేచివెళ్ళాడు. రాగిణి సోఫాలోంచి లేవకుండానే త్రివర్ణా, ప్రణవ్ భార్య పద్మా ఆమె దగ్గరకు వచ్చారు. "ఆంటీ మీకు కూడా శుభాకాంక్షలు" అంటూ రాగిణి గారితో చేతులు కలిపారు. రాగిణి నవ్వింది.

"ఆంటీ మీరీవేళ అద్భుతంగా కన్పిస్తున్నారు. ఈ రాత్రి ఛైర్మన్‌గారు మిమ్మల్ని..." అని ఏదో చెప్పబోయింది త్రివర్ణ.

"చాల్లే వేళాకోళం..." అంది రాగిణి.

"ఈ నలభయ్యో పడిలో మీలా అందంగా ఆకర్షణీయంగా ఉండేవాళ్ళు తక్కువ. ఎందుకైనా మంచిది – ఛైర్మన్ గారితో వారి కళ్ళజోడును మార్చుకోమని చెప్పండి. ఆలోచిస్తే... మాయ, వారి మనసులో కాదు ఆ గ్లాసుల్లో ఉందనిపిస్తోంది..." అంటూ త్రివర్ణ చిలిపిగా నవ్వేసింది.

"త్రివర్ణా, ఆపుతావా నీ జోకులు" అంటూ వారించింది రాగిణి.

"మీరు సంతోషంగా ఉండండి ఆంటీ... మేం ఉన్నాంగా, వెనుక. భయం లేదు. అన్నీ చక్కబెడతాం..." పద్మ ధైర్యం అందించింది.

"ఈ వయసులో నాకెందుకు భయం... ఉన్నదల్లా బాధ ఒక్కటేనమ్మా... ఎక్కడ సంసారం వీధిన పడుతుందోనని..."

సరిగ్గా అప్పుడే ప్రణవ్ వచ్చాడు. పద్మ భర్తనోసారి చూసి, "ఆంటీ అంకుల్ ఈయనగారికి ఘనంగా సహస్రనామపూజ జరిపించారు. నాముందే" అంది నవ్వేస్తూ.

"నా వల్లే ఏం ఫయిర్ అయిపోయారని..." త్రివర్ణ అంది.

"ఏమి అనుకోకు ప్రణవ్... నీకు తెలుసుగా..." అంది రాగిణి నచ్చజెబుతూ.

"తిట్టడానికి వారికి హక్కు వుంది.... పైగా నేను మంత్రసానితనానికి ఒప్పుకున్నానాయే" ప్రణవ్ కూడా నవ్వుతూనే అన్నాడు.

"నేను వెడతాను ఆంటీ..." అంటూ త్రివర్ణ వెళ్ళింది.

"ఏం చేస్తున్నారు?" అంటూ పశుపతిగారు వచ్చి చుట్టూ చూసి "అన్నీ మనం అనుకున్నట్టు జరిగాయి. చిన్న చిన్న లోపాలా, తప్పవు. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. మీరు వెళ్ళిరండి, థాంక్స్ ఫర్ బోత్" అనేసి "ప్రణవ్... రేపు ఈ-మెయిల్ పంపాలి కాలిఫోర్నియాకు.. ఇంకా..." అని ఆగిపోయాడు.

"ఫంక్షన్‌లో కూడా ఆఫీసు టెన్షన్‌లు పెట్టుకోవద్దు" అంది రాగిణి, నెమ్మదిగా.

❖ ❖ ❖

"ప్రణవ్... ఐయామ్ వెరీ సారీ. నేను నిన్ను రెండు నెలలుగా గమనిస్తున్నాను. నువ్వు ఇన్‌టైమ్‌లో పాజిటివ్‌గా రెస్పాండ్ చేయని మూలంగా మన ఇనిస్టిట్యూట్ నుంచి నలుగరు కంప్యూటర్ ఇంజనీర్లకు కాలిఫోర్నియా వెళ్లే అవకాశం పోయింది. ఇంకా మనం మన ప్రభుత్వానికి ప్రామిస్ చేసిన ఎసైన్‌మెంట్స్ కూడా పూర్తి చేయలేకపోయావు. నువ్వెందుకు ఇలా ప్రవర్తిస్తున్నావని నేను అడగను. నీకు మరో రెండు నెలలు టైం ఇస్తున్నాను. ఆ తరువాత నేనేం చేస్తానో చెప్పలేదు... యూకెన్‌గో..."

ప్రణవ్... పశుపతిగారి మాటలకు కాసేపు తలవంచి – అడుగు పక్కకు వేసి ముందు –అక్కడే కూర్చుని డిక్టేషన్ తీసుకుంటున్న త్రివర్ణ వైపోసారి చూసి, బయటకు వెళ్ళిపోయాడు.

"ఆ- ఎంత వరకూ వచ్చాం... డిక్టేషన్ అంతా ఇచ్చానా" అని తనలో తనుగా "కొంతమంది స్టాఫ్‌తో ముఖ్యంగా ఈ ప్రణవ్‌తో కొత్త సమస్యలు వస్తున్నాయి. రాగిణి రికమెండ్ చేసిందని ఉద్యోగం ఇచ్చాను... లాభం లేదు..."

"కొంతమందికి వయసు మీద పడుతున్నా బాధ్యతలు తెలియవంటారండీ"

"అవును త్రివర్ణా... మొన్నో రోజు నీకు అడ్వాన్స్ కావాలన్నావు కదూ" సడెన్‌గా అడిగాడు, పశుపతి.

"నేనా, నేను అడగలేదండీ"

"మర్చే పోయాను. లలిత అడిగింది. నువ్వనుకున్నాను."

త్రివర్ణ మౌనంగా ఉండిపోయింది.

"ఇంట్లో రాగిణీ అంతే, మతిమరుపు ఎక్కువయిందని దెప్పిపొడుస్తుంది. ఎప్పుడూ పరధ్యాన్నంగా ఉంటున్నారంటూ వెక్కిరిస్తుంది..."

"అవును సార్... బావుండదని చెప్పలేదుగానీ నేనూ గమనిస్తూనే ఉన్నాను. ఏదైనా ప్రాబ్లమా సార్..."

"ఏమిటో మనసు నిలకడగా ఉండడం లేదు. కాస్త రిలీఫ్ కోసం ఏ కాశ్మీరో కన్యాకుమారో వెళ్ళాలేమో"

"ఆంటీని వెంటేసుకుని ఓ నెలపాటు దేశం చుట్టిరండి"...

పశుపతి నవ్వేసి, "అమ్మో ఆవిడ్ని తీసుకువెడితే అయినట్టే.... అడుగువేశానంటే చాలు, వంద జాగ్రత్తలు చెబుతుంది. నీకు కాబట్టి చెబుతున్నాను, త్రివర్ణా. ఆవిడకు సరదాలు తక్కువ. వేదాంత ధోరణి ఎక్కువ. 'భగవంతుడెక్కడికి పోతాడు, మనం ఎక్కడికి పోతాం' అంటే వినదు. మైలు దూరంలో గుడిగోపురం కన్పిస్తే ఇక్కడి నుంచే సాష్టాంగ ప్రణామాలు చేస్తుంది. మీ యంగ్‌స్టర్స్ ఎటైనా పోతుంటే చెప్పండి వస్తాను. మీలాంటి వాళ్ళతో ఒక్క రోజు గడిపితే బాడీ, మనసూ కూడా ఏక్టివేట్ అవుతాయనిపిస్తుంది..."

"ప్రణవ్ గారూ, ఇంకా స్టాఫ్ కలిసి ఏదో టూరు ప్రోగ్రాం వేస్తున్నారు... నన్నూ ఆహ్వానించారు.."

"అలానా" అని ఆయన త్రివర్ణ మొహంలోకి సూటిగా చూస్తూ, "జాగ్రత్తమ్మా, పెళ్ళికాని దానివి.. మన ఆఫీసులో సగం మంది కుర్రకారు పోకిరీ రకాలు... చూస్తే పెళ్ళిళ్ళు అయిన వాళ్ళే చాలామంది... ఏం లాభం...."

"అవును సార్... వాళ్ళు హస్కు కొడుతూంటే, మౌనంగా నవ్వి ఊరుకున్నాం అనుకోండి – మర్యాదస్తురాలని భావించరు. మర్నాడు వచ్చి కహానీల మీద కహానీలు చెబుతారు"

"ఈసారి ఎవరైనా హద్దు మీరితే ఊరు కోకు. నాతో చెప్పు... డిస్మిస్ చేసి పారేస్తాను.."

త్రివర్ణ నవ్వేసి, ఆ నవ్వును చిన్నగా చేసి, కుర్చీలోంచి లేచి "వెళతానండీ" అంది.

"వెళతావా, సరే... పనుంటే పిలుస్తాను" పశుపతిగారు ఆమె వెళుతుంటే, గుమ్మం దాటిన ఆమె రూపం అదృశ్యమయితే నొచ్చుకుంటున్న మనసును ఓదార్చుకున్నాడు. కాసేపు కాగితాలు చూశాడు. మరికొంతసేపు ఆలోచించాడు. ఆ పైన ఫోన్ ఎత్తి రింగ్ చేశాడు. "నేను పశుపతిని మాట్లాడుతున్నానమ్మా" అని ఆగి అవతలి కంఠం పద్మదిగా గుర్తించి, నెమ్మదిగా, "ఈ రోజు ప్రణవ్ ఇనిస్టిట్యూట్‌కు రాలేదేం అమ్మా" అని అడిగాడు. అటు నుంచి సమాధానం వచ్చింది. తిరిగి పశుపతి ఎంతో సహజంగా, "నీకు ఏం చెప్తాడో ఏమో కొంచెం నీ జాగ్రత్తలో నువ్వు ఉండు... అవును అవును... ఆమె కూడా ఆఫీసుకు ఈ రోజు రాలేదు..." అని ఊరుకున్నాడు... తిరిగి తనకు ఫోన్‌లో సానుకూలంగా

మాటలు విన్పిస్తుంటే, "వాళ్ళిద్దర్నీ ఒకటి రెండుసార్లు నేను లుంబినీ పార్క్‌లో చూశాను. కృష్ణా ఒబ్రాయ్‌లో కూడా చూసిన గుర్తు. చూసీచూడనట్టు ఊరుకున్నాను... నేను ఏమీ అనకూడదు కదమ్మా... జాగ్రత్త... ఆ ..ఆ... అవును...కానీ ఓ మాట – నా పేరు బయటకు రాకుండా చూడు. ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకో... అంతగా అయితే ఓ రోజు నేనే ఇద్దర్నీ నిలబెట్టి కోర్ట్ మార్షల్ చేస్తాను... ఛాధా బాధపడకు... ఉంటానమ్మా.." అని ఆ తర్వాత ఫోన్ పెట్టేసి తనలో తను నవ్వేసుకున్నాడు.. అంతలోనే ఫోన్ మోగింది. పశుపతిగారు ఫోన్ ఎత్తి "నేనే రాగిణీ... ఇప్పుడే లంచ్ చేస్తున్నాను... ఏమిటీ ... త్రివర్ణా.. ఆ అమ్మాయి నా గదిలో లేదు. పిలవమంటావా?" అన్నాడు. ఆ తరువాత రాగిణి ఏమి అడిగిందో గానీ చిన్నగా త్రివర్ణ సెక్షన్లోని ఫోన్ నెంబరు చెప్పాడు. పశుపతిగారు ఆ పైన నిట్టూర్చి పక్కటేబుల్ మీద ఉన్న హాట్ పేక్ వైపు చూశాడు.

❖ ❖ ❖

పశుపతి చేతిలోని ఉత్తరం చదివాడు. వెంటనే ఆయనలో సంతోషం కెరటంలా పొంగింది. ఆ పైన కొద్దిగా గర్వం దానికి జతకలిసింది. కుర్చీలో కాస్తంత అటూ ఇటూ ఊపుగా కదిలాడు. ఆ ఉత్తరం ఢిల్లీ సర్కారు తాలూకు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నుంచి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ – కంప్యూటర్ రంగంలో సాధిస్తున్న ప్రగతిని కొనియాడుతూ, అందుకు అండదండలు అందిస్తున్న పశుపతిని పొగిడారు. కేంద్ర పాలనలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం కంప్యూటర్ విప్లవం తీసుకురావడానికి యోచిస్తోందనీ, అందుకోసం మూడురోజుల పాటు ఢిల్లీలో ఏర్పాటు చేసే సదస్సులో పాల్గొనమనీ, తమ వంతు నూతన ప్రణాళికను సమర్పించవల్సిందనీ ఆహ్వానించారు.

పశుపతిగారికి తన కుచ్చుల టోపీలో మరో కలికితురాయి జమ అవ్వాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలూ గుర్తుకు వచ్చాయి. తను తయారు చేయబోయే పేపర్లు, ప్రపోజల్స్‌తోపాటు తనతో పాటు తోడుగా తీసుకువెళ్ళవలసిన టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్‌ను ఎన్నిక చేసుకోసాగాడు. ఇద్దరి పేర్లు మనసులో మెదిలాయి. అయినా మనసు తృప్తి పడలేదు. తనతో ప్రయాణించే వారిలో త్రివర్ణ పేరును కలిపి చూసుకున్నాడు. దాంతో తను జరపబోయే యాత్రకు నిండుతనం జమ అయినట్టుగా, తృప్తితో ఊపిరి వదిలి బజ్జర్ నొక్కాడు. త్రివర్ణ లోపలికి వచ్చింది. ఆమెకు క్లుప్తంగా విషయాలు చెప్పాడు. తన నిర్ణయం చెప్పాడు.

"జవాబు రాయాలిగా డిక్టేషన్ తీసుకో" అంటూ ఐదు నిముషాలు రెండు పేజీలకు సరిపడా ఉత్తరాన్ని వినిపించాడు. త్రివర్ణ షార్ట్‌హేండ్‌లో, తన చెవులు వింటోన్నది రాస్తూ అక్కడక్కడా ఆగి, పశుపతిగారి మొహం చూస్తేనే ఉంది.

"జాగ్రత్త, ఈ విషయం టాప్ సీక్రెట్"

"అంతా బాగానే ఉంది. మీతోపాటు ఎక్స్‌పర్ట్స్‌ని తీసుకువెడుతున్నారు. కానీ ఆశ్చర్యం,

ఇందులో ప్రణవ్‌గారి పేరు లేక పోవడం - నా పేరు ఉండడం ఇదేమిటీ... మీరు, అతన్ని..."

"సదస్సుకు ఎవరిని తీసుకువెళ్ళాలో నాకు తెలియదనే అనుకుంటున్నావా?"

త్రివర్ణ తలవంచుకుని, "సారీ... సార్..." అంది.

"నేను అర్జంట్ పనిమీద సెక్రటేరియట్ వెడుతున్నాను. ఓ గంటలో వస్తాను. లెటర్ తయారుచేసి ఉంచు" అంటూ పశుపతి కుర్చీలోంచి లేచి బయటకు వెళ్ళాడు. త్రివర్ణ తల ఊపింది. కానీ ఆమె మొహం మాత్రం ఆలోచనలతో వివర్ణం అయింది. లేచి ఫోన్ ఎత్తి రింగ్ చేసింది... అవతలి నుంచి ఎంగేజ్ సిగ్నల్స్ విన్పిస్తుంటే ఫోన్ పెట్టేసి బుగ్గన చెయ్యి పెట్టుకుని "భగవంతుడా, ఏం చెయ్యాలి..." అని గొణుక్కుంది. తిరిగి ఫోన్ డయల్ చేసింది... ఆ తర్వాత, "నేను ఆంటీ" అంటూ చెప్పసాగింది!

❖ ❖ ❖

పశుపతి చెప్పిందంతా విని, కాసేపు తలవంచుకుని ఉండిపోయింది. ఆ పైన నెమ్మదిగా అంది, "అంతా బాగానే ఉందండి. ప్రణవ్ తన తెలివితేటలతో మన కంపెనీ ఉన్నతికి ఎంతో పాటుపడ్డాడు. అలాంటిది అతన్ని పక్కన పెట్టి మీ కూడా మరెవర్నో తీసుకువెడతారా? పైగా త్రివర్ణ దేనికి మీకూడా?"

"కంపెనీ వ్యవహారాల్లో నీ సలహా తీసుకోవాలని నాకు తెలియదే?"

"ఇది సలహా కాదు."

"పోనీ హెచ్చరిక అంటావా? చెప్పు" పశుపతి నవ్వేశాడు. నవ్వుని ఆపుకుని, "నిజమే కాన్ఫరెన్స్‌లో త్రివర్ణ అవసరం తక్కువే... కానీ ప్రణవ్ నాకూడా వస్తే అటు పద్మకు ఇటు త్రివర్ణకు నష్టం జరుగుతుంది. అదే త్రివర్ణ నాతో వస్తే ఆమెకు మేలు జరుగుతుంది".

"అతనంత చెడ్డవాడు కాదు. అన్యాయంగా మీరతని ఇంటిగ్రిటీని డౌట్ చేస్తున్నారు.."

పశుపతి నెమ్మదిగా అన్నాడు..." మనం అందరం కూడా ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరి నిజాయితీని శంకిస్తూనే ఉంటాం, రాగిణీ... ఇది భార్యాబర్తల విషయంలో కూడా ఎక్సప్షన్ అవదు..."

రాగిణి కాస్త అసహనంగా "మనం ప్రణవ్ గురించి మాట్లాడుకుంటున్నాం. తెలివిగా నన్ను పక్కదారులు పట్టించవద్దు" అనేసింది.

"ప్రణవ్ మీ చుట్టాలబ్బాయి కాబట్టి, నీ రికమెండేషన్ మీద ఉద్యోగం ఇచ్చాను. అతను గొప్ప తెలివిపరుడు. నిజమే...కానీ గొప్ప వాళ్ళందరికీ గొప్ప గొప్ప బలహీనతలుంటాయని మర్చిపోకు"

'ఒకర్ని అనే ముందు.."

"చూడు రాగిణీ... ప్రణవ్ కట్టుకున్న భార్యకి దూరంగా జరుగుతూ పెళ్ళి కాని త్రివర్ణతో చనువుగా ఉంటున్నాడని నేను చెప్పినా నువ్వు పట్టించుకోవు. ఇక నా విషయానికి వస్తే

మాత్రం నేను వేసే ప్రతీ అడుగునూ వేయి కళ్ళతో పరీక్షిస్తావు. బతుకుల్లో కనబడని ట్రాజెడి దాగి ఉంటుందంటే ఇదేనేమో..."

"అవును – మరి. తమరి పోకడలూ విన్యాసాలూ ఎరిగున్న దాన్ని కాబట్టి ఆ మాత్రం భయపడతాను. కానీ అందర్నీ ఒకేగాటన కడతామా? ప్రణవ్‌కు పెళ్ళయి, రెండేళ్ళు కాలేదు. పెళ్ళాం మీద అంత విముఖత ఎందుకు కలుగుతుంది. అంతా మీరు ఊహిస్తున్నారు..."

"అది పెళ్ళాం మీద విముఖత కాదు... పై అమ్మాయి పట్ల ఆకర్షణ. ఈ రోజుల్లో పెళ్ళికాని అబ్బాయిలకన్నా పెళ్ళి అయిన యువకులే అడ్డదారులు తొక్కుతున్నారు ఎక్కువగా! ఎందుకంటే పెళ్ళి అయినవాడు, అపాయం ఉండదనే నమ్మకంతో అమ్మాయిలు చనువుగా ఉంటారు. దాంతోనే వాళ్ళు మోసపోతుంటారు."

"చిన్నప్పుడు తమరూ అంతేకదా ... అందుకేగా రాద్ధాంతం..."

"పెద్దవాణ్ణయ్యాను. ఓ సంస్థకు యజమానిని అయ్యాను. అయినా నువ్వు నన్ను నమ్మలేదు. అనుభవజ్ఞుడిగా మీ ప్రణవ్‌నీ నేను నమ్మడం లేదు. ఒకటీ ఒకటీ రెండు... సరేనా?" పశుపతి అన్నాడు.

"సరే మీ ఇష్టం" అంటూ రాగిణి లేచి అడుగులు వేసింది.

"నా గదిలోంచి వెడుతున్నావ్ గానీ నా మదిలోంచి వెళ్ళడం నీ తరమా రాగిణీ" అన్నాడు నవ్వుతూ పశుపతి.

"ఇప్పటికే, అది వెల్ క్రౌడెడ్ అయి పోయిందని బయటకు వెడుతున్నాను. సారీ" అంది తను కూడా నవ్వుతూ రాగిణి.

❖ ❖ ❖

"పశుపతిగారి కంపెనీలో పనిచేయడం దేనికీ, అపనిందలు భరించడం దేనికీ రిజైన్ చేసెయ్యండి" అంది పద్మ – తన ఉద్దేశం అదేనన్నంత గట్టిగా.

"నన్ను ఆలోచించుకోనివ్వు పద్మా... ఈ ఉద్యోగం రాగిణి అంటీ ఇప్పించారు... అందుకని..."

"పెద్దమనిషయ్యుండీ, ఆ పశుపతిగారు ఏ ఆడపిల్లల వెంటబడితే మనకేం? భార్యే అదుపులో పెట్టుకోలేనివాణ్ణి మీరు దారికి తేగలరా? ఆవిడ చెప్పిందని అనవసరపు బాధ్యతల్ని నెత్తిన వేసుకున్న వాళ్ళకు, అంతే జరుగుతుంది"

"త్రివర్ణ కూడా ఆయనతో చేతులు కలుపుతుందని నేను ఊహించలేదు."

"అందరూ కలిసి మీ ఉద్యోగానికి ఎసరు పెట్టారు."

సరిగ్గా అలా ఆ భార్యాభర్తలిద్దరూ వాదించుకుంటూంటే వీధిలోంచి త్రివర్ణ వచ్చింది. ఆమె ఇద్దరివైపూ ఓసారి చూసి, ఆపైన ప్రణవ్‌తో, "సడెన్‌గా మీరు ఆఫీసుకు సెలవు పారేసి ఇంట్లో కూర్చుంటే ఎలా? అక్కడ మీరు లేక ఇనిస్టిట్యూట్ వెలవెలపోతోంది..."

"ఆయనకు మనసు బాగోలేదు. త్రివర్ణా... నిన్నంతా జ్వరం ఈవేళే తగ్గింది..."

"ఢిల్లీ వెళ్లే ఛాన్సు పోయిన మూలంగా జ్వరం వచ్చి వుంటుంది."

"అది కాదు, అంతకన్నా పెద్ద అవమానాలూ అపనిందలూ మోశాను..."

త్రివర్ణ నెమ్మదిగా అడిగగంది. "ఎవరేమన్నారు? ఛైర్మన్‌గారా... వారి సంగతి మనకు తెలియదా? పెద్దమనిషికి ముక్కు మీద కోపం. మాట పెళుసుగానీ మనసు వెన్న..."

"ఆయన మనసు వెన్నో... అమృతమో నీకే తెలియాలి" పద్మ అంది.

త్రివర్ణ, పద్మ దగ్గరకు వెళ్ళి, భుజం మీద చెయ్యి వేసి "ఆయన గొప్ప ఆపేక్షపరుడు పద్మా..." అంది.

"ఆపేక్షపరుడా? నా బొందా? అందరికీ తనలాంటి గుణాలే ఉంటాయనుకుంటాడు..."

"ఆదా" అంటూ పకపకా నవ్వేసింది త్రివర్ణ.

"నేను మీ మోజులో పడ్డానని ఆయన ఫోన్‌లో నానా కూతలూ కూసి, దీని బుర్ర కాస్తా పాడు చేశాడు. దాంతో ఇది పెట్టె బేడా సర్దింది. ఆయన నన్నో బజారు రౌడీగా చూస్తున్నాడు. మీరైనా ఆయనకు నిజం చెప్పారా? లేదు. నా మీద నేరాలు చెబితే హాయిగా ఢిల్లీ వెళ్ళొచ్చని మీరు ప్లాను వేశారు" ఉక్రోషంగా అన్నాడు ప్రణవ్.

"ఒక మాట వింటారా?"

"చెప్పండి"

"తెలిసి కొంతా తెలియక కొంతా మనందరం ఎవరి దారిన వాళ్ళు వెళ్ళాం. ఛైర్మన్‌గారు నన్నిక్కడికి కారిచ్చి పంపి, మిమ్మల్ని నాతో తీసుకురమ్మన్నారు. మీతో మాట్లాడాలన్నారు.... ప్లీజ్ తయారవండి" అంది త్రివర్ణ.

❖ ❖ ❖

పశుపతిగారు చెబుతున్నారు. ప్రణవ్ వింటున్నాడు.

"చూడు ప్రణవ్... నీకు ఈపాటికి అన్ని విషయాలు తెలిసే ఉంటాయి. మొదట్లో ఢిల్లీ కాన్ఫరెన్స్‌కు నేను వెళదామనుకున్నాను. అన్నీ ఆలోచించిన తర్వాత నా స్థానంలో నువ్వు వెళ్తే మనకు ఎక్కువ మేలు జరుగుతుందనిపిస్తోంది. నా మాట మన్నించు. ఇక – నేనూ మీ ఆంటీ ఓ పది రోజులు ఊటీ వెళ్ళి ఒకర్ని ఒకరం అర్థం చేసుకుని, ఆ పైన ప్రేమించుకునీ వస్తాం.... దారిలో మా అన్నగార్ని కల్సుకుని వాడి కొడుక్కి మన త్రివర్ణను ఇవ్వడం కోసం అన్ని విషయాలూ మాట్లాడి వస్తాం. అసలు అందుకోసమే నేనామెకు ఇంతకాలం రక్షకుడిగా వున్నది." ప్రణవ్ మాట్లాడలేదు. తలవంచుకుని వింటున్నాడు.

"ప్రణవ్... ఈ ప్రేమించే హృదయం ఉంది చూశావూ, ఇది గుడ్డిదే కాదు. కాస్తంత వెర్రిది కూడా! అందుకే అది ఒక్కొక్కసారి మనల్ని దారి మళ్ళించి – మన చేతే మనలోని అనుమానాలకు పెద్దపీట వేయిస్తుంది! జరిగింది అదే కదూ? అవునా??"

ప్రణవ్ ఔనని తలూపాడు. ❖